

జిల్లా కేంద్రమైన బందరు మండలంలోని రెండు కార్యాలయాల్లో తహసీల్దార్లుగా పనిచేసేందుకు అధికారులు వణికిపోతున్నారు. 'ఇక్కడ తహసీల్దార్ పోస్టా! మాకొద్దు బాబోయ్!' అంటూ హడలిపోతున్నారు. గత నెలలో తహసీల్దార్లుగా వచ్చిన వారు ఉన్నతాధికారులను బతిమలాడుకుని వేరే ప్రాంతానికి బదిలీ చేయించుకుంటున్నారు. బదిలీకి అవకాశం లేకుంటే సెలవుపెట్టి వెళ్లిపోతున్నారు. ఇలా బందరు సౌత్, నార్త్ మండలాలకు తహసీల్దార్‌లుగా పనిచేసేందుకు ఎవ్వరూ ముందుకు రావడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్‌భూములకు పట్టాలు ఇవ్వాలని, తాము చెప్పిన అడ్డగోలు పనులు చేయాలని అధికార పార్టీ నేతలు చేస్తున్న ఒత్తిడే ఇందుకు కారణం.

బందరు పోస్టు మాకొద్దు బాబోయ్!



బందరు తహసీల్దార్ కార్యాలయం

అసైన్డ్ భూములకు పట్టాలు ఇవ్వాలని వైసీపీ నేతల ఒత్తిడే కారణం

- తహసీల్దార్‌గా వచ్చేందుకు వెనకడుగు వేస్తున్న అధికారులు
- ఉండలేక ఇద్దరు తహసీల్దార్‌లు ఆర్‌డీవో కార్యాలయానికి మార్పు
- కొత్తగా వచ్చిన తహసీల్దార్ సెలవులో..
- కోడ్ వచ్చేదాకా సెలవు పొడిగింపు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఇటీవల బందరు మండలాన్ని సౌత్, నార్త్ మండలాలుగా విభజించారు. పి.సతీష్‌ను నార్త్ మండల తహసీల్దార్‌గా, శ్రీలక్ష్మిని సౌత్ మండల తహసీల్దార్‌గా నియమించారు. వీరిద్దరు బాధ్యతలు తీసుకునే సమయానికి బందరు మండలంలోని 11 గ్రామాల్లో 12 వేల ఎకరాల అసైన్డ్‌భూములకు పట్టాలు మంజూరు చేసే కార్యక్రమం నడుస్తోంది. అసైన్డ్‌భూములకు సరైన రికార్డులు లేకుండానే ప్రస్తుతం సాగులో ఉన్నవారికి, లేదా గతంలో అసైన్డ్ పట్టాలు పొందిన కుటుంబసభ్యుల్లోని వారసులకు పట్టాలు ఇవ్వాలని స్థానిక శాసనసభ్యుడు తహసీల్దార్లపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకువచ్చారు. ఈ అంశంపై ఆర్‌డీవో, జేసీ, కలెక్టర్‌పైనా ఒత్తిడి పెరిగింది. పలు దఫాలుగా అసైన్డ్ భూములకు పట్టాలు మంజూరు చేసే అంశంపై ప్రజాప్రతినిధులు రెవెన్యూ అధికారులతో, సిబ్బందితో సమావేశాలు నిర్వహించారు.

అక్రమాలు చేయలేమన్న అధికారులు

రికార్డులు సక్రమంగా లేని, బడాబాబుల చేతుల్లో ఉన్న వేలాది ఎకరాల అసైన్డ్‌భూములకు తాము పట్టాలు ఇవ్వలేమని, ఈ ప్రక్రియ ఇప్పటికిప్పుడు పూర్తయ్యేదికాదని రెవెన్యూ అధికారులు తేల్చిచెప్పారు. దీంతో అసైన్డ్‌భూములకు పట్టాలు మంజూరు చేసే అంశం సీఎంవోకు చేరింది. నిబంధనల ప్రకారం జాగ్రత్తగా పరిశీలించి అసైన్డ్‌భూములకు పట్టాలు మంజూరు చేసే అంశంపై ముందుకు వెళ్లాలని సీఎంవో అధికారులు జిల్లా రెవెన్యూ యంత్రాంగానికి సూచించారు. సీఎంవోలో సమావేశం ముగిశాక రెవెన్యూ అధికారులపై అసైన్డ్ భూములకు పట్టాలు ఇచ్చే అంశంలో మరింతగా ఒత్తిడి పెరిగింది. ఈలోగా టీడీపీ నాయకులు అసైన్డ్‌భూములకు పట్టాలు ఇచ్చే అంశానికి సంబంధించి భూమి రికార్డులు, లబ్ధిదారులకు జారీచేసిన నోటీసులతో పూర్తిస్థాయి సమాచారాన్ని ఇవ్వాలని సమాచార హక్కుచట్టం ద్వారా వివరాలు కోరారు. మరోపక్క అసైన్డ్‌భూములకు పట్టాలు ఇవ్వాల్సిందేనని స్థానిక ఎమ్మెల్యే అధికారులపై తీవ్రస్థాయిలో ఒత్తిడి పెంచారు.

ఒత్తిడి తట్టుకోలేక ఆర్డీవో కార్యాలయానికి..

అసైన్డ్ భూములకు సంబంధించి తహసీల్దార్‌లపై ఒత్తిడి పెరగడంతో ఇద్దరు తహసీల్దార్లు ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లేందుకు తమ వంతు ప్రయత్నాలు చేసుకొని సఫలమయ్యారు. సౌత్ మండల తహసీల్దార్ శ్రీలక్ష్మి మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయ ఏవోగా బదిలీపై వెళ్లిపోయారు. ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న రఘురామయ్యకు సౌత్ మండల తహసీల్దార్‌గా పోస్టింగ్ వేశారు. ఇక్కడ నెలకొన్న పరిస్థితులను గమనించిన రఘురామయ్య పదిరోజుల వ్యవధిలోనే తాను ఇక్కడ పనిచేయలేనని అధికారులను బతిమలాడుకుని ఆర్డీవో కార్యాలయంలో కేఆర్‌సీసీ విభాగం తహసీల్దార్‌గా బదిలీ చేయించుకున్నారు. ఇద్దరు తహసీల్దార్లు ఆర్డీవో కార్యాలయానికి వెళ్లిపోవడంతో ఉన్న ఒక్క తహసీల్దార్ పి.సతీష్‌పై అసైన్డ్ భూములకు పట్టాలు ఇచ్చే భారం పడింది. నిబంధనలకు విరుద్ధంగా పట్టాలు మంజూరుచేస్తే తన ఉద్యోగానికి ఇబ్బంది అవుతుందనే కారణంతో ఆయన అనారోగ్య కారణాలు చూపి సెలవుపై వెళ్లిపోయారు. తొలుత నాలుగు రోజులపాటు సెలవుపెట్టారు. అది ముగిశాక మళ్లీ సెలవును పొడిగించారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైతే అసైన్డ్‌భూములకు పట్టాలు ఇచ్చే అంశం మరుగున పడుతుందని రెవెన్యూ ఉద్యోగులు చెప్పుకుంటున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తరువాతనే తహసీల్దార్ విధుల్లో చేరతారని రెవెన్యూ సిబ్బంది చెప్పుకుంటున్నారు. ఇద్దరు తహసీల్దార్లు లేకపోవడంతో డెప్యూటీ తహసీల్దార్‌కు అదనపు బాధ్యతలు అప్పగించి పరిపాలన కొనసాగిస్తున్నారు.




కుమ్మరిగూడెం వద్ద ప్రభుత్వ భూమిలో వెలసిన షెడ్లు

ఆక్రమిత భూమిలో కుళాయిలు

- వైసీపీ నేతల ఒత్తిడితో అనుమతులు మంజూరు చేసిన మున్సిపల్ అధికారులు

మచిలీపట్నం, మార్చి12 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు ముందు అధికార పార్టీ నాయకులు తమ ఇష్టానుసారంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. నిబంధనలను పక్కనపెట్టి అడ్డగోలుగా అధికారాన్ని ఉపయోగించుకుని అడ్డదారులు తొక్కుతున్నారు. ప్రభుత్వ నిధులను వినియోగించి ఆక్రమించుకున్న స్థలంలో నిర్మించిన షెడ్‌ల వద్ద నీటి కుళాయిలు ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. అనుకున్నదే తడవుగా గుట్టుచప్పుడు కాకుండా కుళాయిల ఏర్పాటుకు మున్సిపాలిటీ నుంచి అనుమతులు మంజూరు చేయించేశారు. మచిలీపట్నం నగర శివారు కుమ్మరిగూడెం వద్ద జాతీయ రహదారి పక్కనే ఉన్న రూ.100 కోట్ల విలువైన భూమిని అధికార పార్టీ నాయకులు ఆక్రమించి తమ అనుయాయులతో ఇక్కడ ఇటీవల షెడ్లు వేయించారు. రెవెన్యూ అధికారులు ఇక్కడ ఎవ్వరికీ ఇంటి స్థలాలకు సంబంధించి పట్టాలు మంజూరు చేయలేదు. అయినా కోట్ల విలువైన భూమిని ఆక్రమించి అక్కడ షెడ్లు వేశారు. ఇటీవల కాలంలో ఈ షెడ్‌లకు మునిసిపల్ కార్పొరేషన్ ద్వారా ఇంటి పన్నుల నోటీసులు ఇప్పించారు. కొంతమందితో ఇంటి పన్నులు కట్టించారు. ఈ నేపథ్యంలో అక్కడ తాగునీటి వసతికోసం కుళాయిలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యేలోగా ఈ కాలనీలో ప్రధాన పైప్‌లైన్‌తోపాటు ఇంటింటికీ తాగునీటి కుళాయిలను ఏర్పాటు చేయాలని మునిసిపల్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అధికార పార్టీ నాయకులు ఆక్రమించుకున్న విలువైన భూమిలో ప్రభుత్వ సొమ్ముతో కుళాయిలు కూడా ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవడం చర్చనీయాంశమవుతోంది.



ప్రైవేటుకు.. బార్లు!

తీవ్రమైన ఆకలిని తీర్చుకోవడానికి పాము తన పిల్లలను తనే చంపి తిన్నట్టుగా.. సాలె పురుగులు ఆహారం కోసం వాటి పిల్లలను అవే తిన్నట్టుగా.. కమీషన్లకు కక్కుర్తిపడిన పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ఇదే పద్ధతిని అనుసరిస్తోంది. ఏపీటీడీసీ ఆధ్వర్యంలోని బార్లను నిర్వీర్యం చేసి ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు సిద్ధమవుతోంది. ఎన్నికలలోపే ఈ ప్రక్రియను ముగించేందుకు ఏపీటీడీసీ ఉన్నతాధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. విజయవాడ డివిజన్ పరిధిలోని హరిత బెర్మ్‌పార్క్‌తో పాటు మిగిలిన పర్యాటక యూనిట్లలో మొత్తం 40 బార్లను ప్రైవేటీకరించేందుకు ప్రణాళికలు రూపొందించారు. దీనికి ప్రతిఫలంగా రూ.4 కోట్లు కమీషన్ల రూపంలో ముడుపులు ముడుతున్నాయని తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

కమీషన్ల కోసం ఏపీటీడీసీ నిర్వాకం

- రూ.4 కోట్ల ముడుపుల కోసమేనని ఆరోపణలు
- 'విజయవాడ' సహా మొత్తం 40 బార్లు అప్పనంగా..
- రంగం సిద్ధం చేసిన ఉన్నతాధికారులు
- పరోక్ష పద్ధతిలో కట్టబెట్టేందుకు కుయుక్తులు
- ఏపీటీడీసీ బార్ పక్కనే.. మరో బార్‌కు అనుమతి
- ఇప్పటికే కృష్ణవేణి మోటెల్ పక్కన చేరిన కొత్త బార్
- ప్రైవేటు వ్యక్తులతో సంప్రదించి ఆఫర్ చేస్తున్న వైనం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఆతిథ్య సేవలు అందిస్తున్న ఏపీటీడీసీ టూరిజం పాలసీలో భాగంగా రెండు దశాబ్దాలుగా బార్లను కూడా నిర్వహిస్తోంది. వీటి ద్వారా సంస్థకు భారీగా లాభాలు వస్తున్నాయి. లాభాలు వచ్చే బార్లలోకి సరికొత్త సరుకును తీసుకు రావటంతో పాటు, మరింత మంది పర్యాటకుల ఆదరణను చూరగొనేలా బార్లను ఆధునీకరరించటం, వినోదంగా ఉండేలా తీర్చిదిద్దటం వంటివి చేయాల్సి ఉంది. నాలుగున్నరేళ్లుగా పర్యాటక యూనిట్ల పరిధిలోని బార్లను ఆధునీకరించలేదు. వస్తున్న ఆదాయంలో పది పైసలు కూడా బార్ల అభివృద్ధికి ఖర్చు పెట్టలేదు. కమీషన్లపై ఆశతో బార్లను ప్రైవేటీకరించేందుకు కుయుక్తులు పన్నుతున్నారు. ఇటీవల వైజాగ్ యాత్రీ నివాస్‌లో స్థానికంగా ఉన్న బార్‌కు అదనంగా ఏపీటీడీసీ స్థలాన్ని ప్రభుత్వ బారుకు అనుమతిచ్చింది. దీంతో అప్పటి వరకు పర్యాటక బారు సాధిస్తున్న రూ.లక్షన్నర ఆదాయం కాస్తా రూ.50 వేలకు పడిపోయింది. ఏపీటీడీసీ స్థలంలో ఏర్పాటు చేసిన బారు ఆదాయం మాత్రం పెరిగిపోయింది. ఈ పేరుతో ఏపీటీడీసీ బారు నష్టాల్లో ఉందన్న సాకు చూపుతూ దానిని ఓఅండ్‌ఎం కింద ప్రైవేటుకు ఇవ్వాలని ఏపీటీడీసీ అధికారులు భావిస్తున్నారు.

కృష్ణవేణి మోటెల్‌లోని బార్ పరిస్థితిదీ..

విజయవాడ డివిజన్‌లోని ప్రకాశం బ్యారేజీ చివరన ఉన్న కృష్ణవేణి మోటెల్‌లో ఏపీటీడీసీ బారు ఉంది. ఈ మోటెల్ బయట మద్యం దుకాణానికి అనుమతి ఇచ్చింది. దీంతో బయటి దుకాణం దగ్గర విక్రయాలు పెరిగాయి. క్రిష్ణవేణి మోటెల్‌లో ఉన్న బారు ఖాళీగా ఉంటోంది. ఈ ఐడియా నచ్చటంతో వైపాడులో కూడా ఇదే విధానాన్ని అమలు చేయాలని చూస్తోంది. ఈ పరిణామాలన్నింటినీ గమనించిన తర్వాత తాజాగా విజయవాడ యూనిట్‌పై ఏపీటీడీసీ ఉన్నతాధికారుల చూపు పడింది. హరిత బెర్మ్‌పార్క్, కృష్ణవేణి మోటెల్‌లతోపాటు మొత్తంగా 40 బార్లను ప్రైవేటీకరించాలని నిర్ణయించింది.

ప్రైవేటీకరణ కోసం పరోక్ష పద్ధతి అమలు

ఏపీటీడీసీ బార్లను తీసివేసి ఎకాఎకిన ప్రైవేటు వ్యక్తులకు నిర్వహణ అప్పగిస్తే యూనియన్లపరంగా సమస్యలు వస్తాయి. వ్యతిరేకతను మూటగట్టుకోవాల్సి ఉంది. అందుకే తెలివిగా ఏపీటీడీసీ ఉన్నతాధికారులు కొత్త ఆలోచన చేశారు. బార్ల పక్కనే ఏపీటీడీసీ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు బార్లు పెట్టుకునేందుకు కేటాయించాలని నిర్ణయించారు. నూతన పర్యాటక విధానంలో భాగంగా ఏపీటీడీసీ నేతృత్వంలో బార్ల ఏర్పాటుకు ప్రతిబంధకాలు లేవన్న వాదనలను ఉన్నతాధికారులు తీసుకు వస్తున్నారు. బార్లకు అనుమతులిచ్చేది కూడా తామేనని, నిరభ్యంతరంగా తమ పర్యాటక యూనిట్లలో ఏర్పాటు చేసుకోవచ్చని చెబుతున్నారు.

ప్రైవేటు వ్యక్తులను ఆకర్షించేలా ఆఫర్

తమ యూనిట్లలో బార్లను ఏర్పాటు చేసుకుంటే లాభదాయకంగా ఉంటుందని ఏపీటీడీసీ ఉన్నతాధికారులు ప్రచారం చేస్తున్నారు. బార్ లైసెన్స్ కోసం విడిగా అయితే రూ.40 లక్షలు కనీస ఫీజుగా కట్టాలని, తమ దగ్గర రూరల్ ఏరియాలో అయితే రూ.3.20 లక్షలు, పట్టణ పరిధిలో అయితే రూ.6.30 లక్షలు చెల్లిస్తే సరిపోతుందని చెబుతున్నారు. దీనివల్ల బార్ లైసెన్స్ ఫీజులో రాయితీ పొందవచ్చునని ఉన్నతాధికారులు ప్రచారం చేస్తున్నారు. బార్‌ను నిర్వహించాలంటే స్థలం కావాల్సి ఉంటుందని, పర్యాటకాభివృద్ధి సంస్థ ఆవరణలో స్వేచ్ఛగా నిర్వహించుకోవచ్చన్న ఆఫర్‌ను కూడా ఇచ్చేస్తున్నారు. స్థలం కోసం భారీగా ఖర్చు చేసే అవకాశం కూడా ఉండదని ఊరిస్తున్నారు. నూతన పర్యాటక విధానం పేరు చెప్పి బార్లను ప్రైవేటీకరించే ఆలోచనలతో.. ముందుకు వెళుతున్న ఉన్నతాధికారుల తీరుపై ఇప్పటికే యూనియన్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశాన్ని కోర్టులో సవాల్ చేసే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు.



కాషాయ వందేభారత్ వచ్చింది

సికింద్రాబాద్ - విజయవాడ - విశాఖపట్నం మధ్య రెండో వందేభారత్

- మధ్యాహ్నం విజయవాడ స్టేషన్‌కు రాక..
- రైల్వే అధికారుల స్వాగతం
- బెజవాడకు మూడో వందేభారత్.. విజయవాడ డివిజన్‌కు నాలుగో వందేభారత్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బెజవాడ మీదుగా వెళ్లే మూడో వందేభారత్ రైలుకు మంగళవారం ప్రధాని మోదీ శంకుస్థాపన చేసి ప్రారంభించారు. విజయవాడ రైల్వేస్టేషన్ మధ్యాహ్నం సికింద్రాబాద్ నుంచి వచ్చింది. నూతన వందేభారత్ రైలుకు ఏడీఆర్‌ఎం శ్రీకాంత్, సీనియర్ డీసీఎం వి.రాంబాబు స్వాగతం పలికారు. నూతన వందే భారత్ రాక సందర్భంగా బెజవాడ స్టేషన్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రైలును వీక్షించటానికి పెద్దఎత్తున ప్రజలు వచ్చారు. ఈ రైలులో ప్రయాణించటానికి కూడా పెద్ద సంఖ్యలో ప్రయాణికులు వచ్చారు. కాషాయరంగులో ఉన్న వందేభారత్ రైలు సికింద్రాబాద్ - విజయవాడ - విశాఖపట్నం మధ్య నడవనుంది. ఈ రైలు విజయవాడ మీదుగా వెళ్లే వందేభారత్‌లలో మూడవది కాగా విజయవాడ డివిజన్ మీదుగా వెళ్లే వాటిలో నాల్గవది. నాల్గవ రైలు సికింద్రాబాద్ - తిరుపతి రైలు మాత్రం విజయవాడను టచ్ చేయకుండానే వెళుతుంది. సికింద్రాబాద్ - విజయవాడ - విశాఖపట్నం రైలుతో పాటు విజయవాడ - చెన్నై మధ్యన మరో వందేభారత్ రైలు విజయవాడ మీదుగా నడుస్తుంది. సికింద్రాబాద్ - విజయవాడ - విశాఖ మధ్యన ఇది రెండవ వందేభారత్ రైలు కావటం గమనార్హం. ఈ మార్గంలో ప్రవేశపెట్టిన వందేభారత్ రైలు బెజవాడ - విశాఖ మధ్యన రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ వద్ద ఆగుతుంది.

'కేంద్రాన్ని' ఖాతాలో వేసుకున్న జగన్

కనకదుర్గ ఫ్లై ఓవర్ ఆయనే నిర్మించారట

- బెంజ్ సర్కిల్ ఫ్లై ఓవర్లదీ అదే పరిస్థితి
- చిన అవుటపల్లి - మంగళగిరి బైపాస్ తన ఖాతాలోనే
- చేయని అభివృద్ధికి సొంత డబ్బా!

- 6లో..





ఇఫ్తార్ (సాయంత్రం) : 6-21 (బుధ)
సహర్ (ఉదయం) : 4-57 (గురు)

కన్నతండ్రే కాటేశాడు!

కూతురిపై పలుమార్లు లైంగిక దాడి

- వీరవల్లిలో ఆలస్యంగా వెలుగు చూసిన అమానుష ఘటన

- 6లో..

శరత్ బెయిల్‌పై ముగిసిన వాదనలు

» తీర్పు ఈనెల 14కి రిజర్వ్

విజయవాడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ ఎగవేత కేసులో అరెస్టయిన మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడు శరత్ బెయిల్ పిటిషన్‌పై విజయవాడ మొదటి అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ కోర్టులో మంగళవారం వాదనలు ముగిశాయి. ప్రాసిక్యూషన్ తరఫున సీఐడీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.సత్యనారాయణ వాదనలు వినిపించారు. శరత్ నకిలీ ఇన్వయిస్‌లు, బిల్లుల ద్వారా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌గా రూ.100 కోట్ల కుంభకోణం చేశారని వాదించారు. అతడికి బెయిల్ ఇస్తే సాక్ష్యాలను ట్యాంపరింగ్ చేసే అవకాశాలు ఉన్నాయన్నారు. పైగా శరత్ రాష్ట్రం నుంచి పారిపోయే సూచనలు ఉన్నాయన్నారు. అంతేగాకుండా కేసు సీఐడీకి బదిలీ అయిందని, బెయిల్ ఇచ్చే అధికారం ఈ కోర్టుకు లేదని వాదించారు. ప్రత్తిపాటి పుల్లారావు పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు కాంట్రాక్ట్ సంస్థలను ప్రలోభపరుచుకుని ఈ స్కాం చేశారన్నారు. శరత్ నుంచి మరిన్ని వివరాలు రాబట్టాల్సి ఉందన్నారు. దీనిపై శరత్ తరఫున న్యాయవాది కిలారు బెనర్జీ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కేసులో ఆరో సాక్షి ప్రభుత్వ ఉద్యోగి అని, ఆయనను బెదిరించే అవకాశం లేదని చెప్పారు. టీడీపీ హయాంలో పుల్లారావు అసలు పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేయలేదని వాదించి, అందుకు సంబంధించిన జీవోలను కోర్టు ముందు ఉంచారు. ఇరు న్యాయవాదుల వాదనలు విన్న న్యాయాధికారి కరీముల్లా తీర్పును ఈనెల 14వ తేదీకి రిజర్వ్ చేశారు.



తెలుగుదేశం పార్టీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

ఎన్నికల్లో వైసీపీ గల్లంతవడం ఖాయం

» రవీంద్ర సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

మచిలీపట్నం టౌన్, మార్చి 12 : టీడీపీ, జనసేన, బీజేపీ సునామీలో వైసీపీ గల్లంతవడం ఖాయమని మాజీమంత్రి, టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. 12వ డివిజన్ భాస్కరపురంలో మంగళవారం రవీంద్ర జనసేన నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వైసీపీకి చెందిన నూకల రాధాకృష్ణ, నిమ్మగడ్డ వాసు, కొమ్మన బాబ్జీ, నూకల తేజారామ్‌లకు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఇంటింటికి పర్యటించి చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ, ప్రజల సంక్షేమం, అభివృద్ధి కావాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. బందరు అభివృద్ధి కోసం సమిష్టిగా సైనికుల్లా పనిచేద్దామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఐపీసీ కరుణకుమార్, ఇలియాస్ పాషా, పిప్పళ్ల కాంతారావు, బొమ్మిడి శ్రీరాములు, నాయుడు తులసి, చింతా సోమేశ్వరరావు, వీరంకి సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.



అచ్చెన్నాయుడు సమక్షంలో టీడీపీలో చేరిన యాదవ సంఘ నాయకులు

గుడివాడ టీడీపీ గెలుపులో భాగస్వాములవుతాం

» యాదవ సంఘం నాయకులు

గుడివాడ, మార్చి 12 : గుడివాడలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వెనిగండ్ల రాము గెలుపులో భాగస్వామ్యులవుతామని నియోజకవర్గ యాదవ సంఘ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం విజయవాడలో రాష్ట్ర అధ్యక్షుడు కింజరపు అచ్చెన్నాయుడు సమక్షంలో యాదవ సంఘ నాయకులు లోయ శివాజీ, మాగంటి పాండురంగారావు, మెరుగుమాల రవికుమార్, ఆగొల్లు బాలాజీ, దళిత నాయకులు మత్తే సూర్యచంద్రరావులు టీడీపీలో చేరారు. వీరికి అచ్చెన్నాయుడు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గుడివాడలో అతి త్వరలో వేలాదిమందితో బహిరంగసభను నిర్వహిస్తామని, ఈ సభలో పెద్ద ఎత్తున బీసీ నాయకులు పార్టీలో చేరనున్నట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న బొండా ఉమా

భావితరాల భవిష్యత్తు కోసం గెలిపించండి

» బొండా ఉమా పిలుపు

అజిత్‌సింగ్‌నగర్ : భావితరాల భవిష్యత్తు కోసం తెలుగుదేశం, జనసేన పార్టీలను గెలిపించాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని షాదీఖానాలో సెంట్రల్ నియోజకవర్గం జనసేన పార్టీ సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఆయన ముందుగా ఎన్టీఆర్, వీఎం. రంగాల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బొండా ఉమా మాట్లాడుతూ రాష్ట్రంలో సైకో పాలన విముక్తి కోసమే టీడీపీ, జనసేన, బీజేపీ ఒక్కటయ్యారని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్దే తప్ప నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదన్నారు. నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ చేయనున్న అభివృద్ధిలో జనసేన కూడా భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. విజ్ఞులైన ప్రజలు సైకిల్ గుర్తుపై ఓటు వేసి మళ్లీ తమ అధినేత చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని కోరారు.



అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వెనిగండ్ల, రావి

మాలలకు తగిన రాజకీయ గుర్తింపునివ్వండి

» వెనిగండ్లకు జైభీమ్ ఆర్మీ వినతి

గుడివాడ : నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న మాల సామాజిక వర్గానికి రాజకీయంగా, నామినేటెడ్ పదవుల్లో తగిన గుర్తింపునివ్వాలని జైభీమ్ ఆర్మీ సభ్యులు టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వెనిగండ్ల రామును కోరారు. మంగళవారం రాత్రి స్థానిక ఫంక్షన్ హాల్‌లో జైభీమ్ ఆర్మీ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి కాకొల్లు భస్కాకరరావు, దళిత సంఘం నాయకులు గొర్రుముచ్చు నరసింహారావుల ఆధ్వర్యంలో మాలల అభివృద్ధి, సంక్షేమానికి ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వెనిగండ్ల మాట్లాడుతూ, మాలల అభివృద్ధి, సంక్షేమానికి టీడీపీ కట్టుబడి ఉందన్నారు. వైసీపీ పాలనలో రద్దు చేయబడిన సంక్షేమ పథకాలను తిరిగి పునరుద్ధరిస్తామని చంద్రబాబు ప్రకటించారని గుర్తుచేశారు. పలువురు దళిత నాయకులు మాట్లాడుతూ, గతంలో జగన్‌రెడ్డి చేసిన తప్పుడు వాగ్దానాలు, మాయమాటలను రాష్ట్ర ప్రజలు నమ్మి ఒక్క అవకాశం ఇవ్వగా ప్రజలను అన్ని రకాలుగా ఇబ్బందులకు గురిచేశాడన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి మద్దతుగా నిలుస్తామని ముక్తకంఠంతో తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, యలవర్తి శ్రీనివాసరావు, పిన్నమనేని బాబ్జీ, వాసే మురళీ, చాట్రగడ్డ రవికుమార్, గడ్డం ప్రకాష్‌దాసు, మెరుగు మోజెస్, జోజిబాబు, నీరుడు సురేష్, రమేష్, కర్రే వెంకటగిరి తదితరులు పాల్గొన్నారు.

చట్ట విరుద్ధంగా ప్రకటన చేసే వారిపై చర్యలు : డీఎంహెచ్‌వో

మచిలీపట్నం టౌన్, మార్చి 12 : చట్టరీత్యా వైద్య, ఆరోగ్యశాఖ సూచనల మేరకు ఎవరైనా ప్రైవేటు వైద్యులు, నర్సులు చట్టాలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో గీతాబాయి హెచ్చరించారు. మంగళవారం డీఎంహెచ్‌వో మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ పోర్టల్‌లో నమోదు కాకుండా గుగుల్‌లో ప్రకటనలు చేసినా, ప్రచురణలు చేసినా చట్టరీత్యాచర్యలు తప్పవన్నారు. మొదటి తప్పుకు షోకాజ్ నోటీసు, రెండో తప్పుకు రూ. 25వేల జరిమానా, మూడో తప్పునకు చట్టరీత్యా చర్యలు ఉంటాయన్నారు.

కేంద్రాన్నీ ఖాతాలో వేసుకున్న జగన్

» కనకదుర్గ ఫ్లైఓవర్ ఆయనే నిర్మించారట

» బెంజ్ సర్కిల్ ఫ్లైఓవర్లదీ అదే పరిస్థితి

» చిన్నఅవుటపల్లి - మంగళగిరి బైపాస్ తన ఖాతాలోనే

» చేయని అభివృద్ధికి సొంత డబ్బా

(ఆంధ్రజ్యోతి - విజయవాడ)

సొమ్ము ఒకరిది సోకు మరొకరిది అన్నట్టుగా ఉంది సీఎం జగన్ పరిస్థితి. ఎదురుగా ఏ కట్టడం కనిపించినా అది తన కృషి ఫలితమే అని చెప్పుకునే స్థితి దాపురిస్తోంది. ఎన్నికల సమయం దగ్గర పడుతున్న కొద్దీ జగన్ కొట్టుకునే సొంత డబ్బా హద్దులు దాటేస్తోంది. అబద్ధాలు చెప్పడంలో ఆరితేరిన జగన్ ఒక పక్క కనకదుర్గమ్మ, మరోపక్క కృష్ణమ్మ సాక్షిగా అవే అబద్ధాలను వినిపించారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వం నిర్మించిన ఫ్లైఓవర్లను, ప్రస్తుతం నిర్మిస్తున్న బైపాస్ రోడ్డును జగన్ తన ఖాతాలో వేసుకున్నారు. విజయవాడ కృష్ణలంకలో కృష్ణానదికి వెంబడి నిర్మించిన రిటైనింగ్‌వాల్, దీన్ని ఆనుకుని అభివృద్ధి చేసిన పార్కు(కృష్ణమ్మ జలవిహారం)ను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఇక్కడి నుంచే ప్రజలను ఉద్దేశించి జగన్ ప్రసంగించారు. ప్రతిపక్షాలు అభివృద్ధి... అభివృద్ధి అంటూ గగ్గోలు పెడుతున్నాయని విమర్శలు చేస్తూనే కేంద్రం అభివృద్ధి చేసిన ప్రాజెక్టులను మొత్తం వైసీపీ పాలనలోని అభివృద్ధిగా చూపించారు.

'బెంజ్'లు ఆయనవేనా...

విజయవాడలో ఉన్న ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి టీడీపీ హయాంలో నిరంతరం బిజీబిజీగా ఉండే బెంజ్‌సర్కిల్‌లో రెండు ఫ్లైఓవర్‌ను నిర్మించాలని భావించింది. కేంద్రంతో సంప్రదింపులు చేసి జాతీయ రహదారికి రెండు వైపులా రెండు ఫ్లైఓవర్లను మంజూరు చేయించింది. ఒక్కో ఫ్లైఓవర్‌ను రూ.88 కోట్లలో నిర్మించాలని తలపెట్టింది. మొదటి ఫ్లైఓవర్ పనులు టీడీపీ హయాంలో ప్రారంభమయ్యాయి. దాదాపుగా ఫ్లైఓవర్‌ను పనులన్నీ ఆ ప్రభుత్వంలోనే పూర్తయ్యాయి. 2019లో జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఫ్లైఓవర్‌ను ముస్తాయి చేయించుకుని ప్రారంభించారు. ఇక రెండో ఫ్లైఓవర్‌కు అన్ని అనుమతులు తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడే వచ్చాయి. పనులు ప్రారంభం మాత్రమే జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత అయ్యాయి. వంతెన పూర్తవ్వగానే కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ దీన్ని ప్రారంభించారు. ఈ రెండో ఫ్లైఓవర్‌ను తన ఖాతాలో జగన్ వేసుకున్నారు.



విజయవాడ బెంజ్‌సర్కిల్ వద్ద నిర్మించిన ఫ్లై ఓవర్ (ఫైల్ ఫొటో)

'కనకదుర్గ'కు కారణం ఆయనేనట

జాతీయ రహదారులు సాధారణంగా మిగిలిన ఇతర ప్రాంతాల్లో నగరాల బయట నుంచి వెళ్తాయి. విజయవాడలో మాత్రమే నగరం మధ్య నుంచి జాతీయ రహదారులు వెళ్తాయి. ఇందులో హైదరాబాద్ జాతీయ రహదారి ఒకటి. దీనివల్ల పశ్చిమ నియోజకవర్గంలోని కనకదుర్గ ఆలయం ముందు విపరీతమైన వాహనాల రద్దీ ఉండేది. భారీ వాహనాలన్నీ నగరం మధ్య నుంచే రాకపోలు సాగించాల్సిన పరిస్థితి. దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని తెలుగుదేశం ప్రభుత్వం భావించింది. ఇందుకోసం పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ దాటిన తర్వాత ఉన్న రాజీవ్‌గాంధీ పార్కు నుంచి భవానీపురంలోని సితార సెంటర్ వరకు భారీ ఫ్లైఓవర్‌ను నిర్మించడానికి పూనుకుంది. కేంద్రంతో సంప్రదించి ఈ ఫ్లైఓవర్‌ను సాధించింది. రూ.502 కోట్లతో వింగ్స్‌తో ఫ్లైఓవర్‌ను నిర్మించారు. 2019 ఎన్నికలకు ముందే ఈ ఫ్లైఓవర్ పూర్తయింది. చిన్న చిన్న పనులు మాత్రమే మిగిలి ఉండగా ఎన్నికల కోడ్ వచ్చింది. తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అంతా పూర్తయిన ఫ్లైఓవర్‌ను జగన్ ప్రారంభించి ఇది తన అభివృద్ధి అని చెప్పుకుంటున్నారు.

బైపాస్ నాదే...

కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా దశల వారీగా జాతీయ రహదారులను అభివృద్ధి చేస్తోంది. ప్యాకేజీలుగా ఈ పనులను పూర్తి చేస్తోంది. పూర్తయిన రహదారులను ప్రధాని నరేంద్ర మోదీ కొన్నిరోజులుగా ప్రారంభిస్తున్నారు. త్వరలో నిర్మించబోయే రహదారులకు భూమిపూజ చేస్తున్నారు. ఇందులో భాగంగానే రాష్ట్రంలోని పలు ప్రాజెక్టులకు రెండు రోజుల క్రితం ఆయన శంకుస్థాపనలు చేశారు. ప్రస్తుతం విజయవాడ బైపాస్ రోడ్డును ప్యాకేజీలుగా నిర్మిస్తున్నారు. ఇందులో చినఅవుటపల్లి నుంచి మంగళగిరి ప్యాకేజీలో పనులు జరుగుతున్నాయి. ఇది పూర్తిగా కేంద్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో నడుస్తోంది. ఈ బైపాస్ రోడ్డును మరో రెండు నెలల్లో అందుబాటులోకి తీసుకువస్తామని జగన్ కృష్ణమ్మ పక్కన నిలబడి ప్రకటించారు. మొత్తంగా టీడీపీ హయాంలో పూర్తయిన ప్రాజెక్టులను, కేంద్రం పూర్తిచేస్తున్న ప్రాజెక్టులను తన అభివృద్ధిగా జగన్ చెప్పుకోవడం గమనార్హం. అభివృద్ధి గురించి మాట్లాడే ప్రతిపక్షాలకు ఇదే తన అభివృద్ధి అని అబద్ధాలతో చూపించే ప్రయత్నం చేశారు.

టీడీపీ ఫ్లెక్సీల తొలగింపుపై రగడ

» సర్దిచెప్పి పంపేసిన పోలీసులు



బైక్‌పై వెళుతూ ఫ్లెక్సీ చించేస్తున్న వైసీపీ కార్యకర్తలు

మచిలీపట్నం టౌన్, మార్చి 12 : జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో తెలుగుదేశం పార్టీ ఫ్లెక్సీల తొలగింపు వివాదాస్పదమైంది. మంగళవారం టీడీపీ ఫ్లెక్సీలను మునిసిపల్ సిబ్బంది తొలగిస్తుండగా, తెలుగుయువత నాయకులు అడ్డుకున్నారు. వైసీపీ ఫ్లెక్సీలను వదిలిపెట్టి టీడీపీ ఫ్లెక్సీలను మాత్రం తొలగించడమేంటని మునిసిపల్ సిబ్బందిని ప్రశ్నించడంతో ఉద్రిక్తతకు దారితీసింది. కోనేరు సెంటర్, కూడలి ప్రాంతాల్లో వైసీపీ భారీ ఫ్లెక్సీలుండగా వాటిజోలికి వెళ్లకుండా టీడీపీకి చెందిన చిన్న చిన్న ఫ్లెక్సీలను మునిసిపల్ సిబ్బంది తొలగించడంతో తెలుగుయువత టీఎన్ఎస్ఎఫ్ నాయకులు కట్టా దుర్గా తదితరులు అడ్డుకున్నారు. అప్పటికే సగం ఫ్లెక్సీలను సిబ్బంది తొలగించేశారు. అనంతరం అక్కడకు చేరుకున్న పోలీసులు వారికి నచ్చజెప్పి పంపేశారు.

మితిమీరిపోతున్న వైసీపీ కార్యకర్తల ఆగడాలు..

మచిలీపట్నం మెయిన్‌రోడ్డులో ర్యాలీగా వెళుతున్న వైసీపీ కార్యకర్తలు డివైడర్‌పై ఉన్న టీడీపీ బ్యానర్లను చించివేశారు. ఒక పక్కన ఫ్లెక్సీల రగడ జరుగుతున్న నేపథ్యంలో వైసీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో రోడ్డుపై వెళుతూ ఫ్లెక్సీలు తొలగించడం చర్చనీయాంశమైంది. అక్కడే ఉన్న టీడీపీ కార్యకర్తలు వారిస్తున్నా.. పోలీసులు చూస్తూ మిన్నకుండిపోయారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా టీడీపీ కార్యకర్తలను దూరంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేయడం కొసమెరుపు.

ఈవీఎంలకు పటిష్ఠ భద్రత

» స్ట్రాంగ్‌రూమ్‌లు పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

మచిలీపట్నం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈవీఎంలకు పటిష్ఠమైన భద్రతను కల్పించేందుకు అన్నిచర్యలు తీసుకుంటున్నట్టు కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్‌రూమ్‌లు, ఈవీఎంలు అందజేసే కేంద్రాలను ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మితో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తరువాత జిల్లాకేంద్రంలో ఉన్న ఈవీఎం గూడౌన్‌నుంచి ఆయా నియోజకవర్గాలలో ఎంపికచేసిన స్ట్రాంగ్‌రూమ్‌లకు ఈవీఎంలను తరలించి భద్రపరుస్తామన్నారు. పోలింగ్‌కు ముందు రెండవస్థాయిలో ఈవీఎంలను అసెంబ్లీ నియోజకవర్గాలలోని పోలింగ్ కేంద్రాలకు కేటాయించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ఈవీఎంల భద్రతకు సంబంధించి పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. పోలింగ్ ముగిశాక ఈవీఎంలను కౌంటింగ్ నిమిత్తం మచిలీపట్నంలోని కృష్ణాయూనివర్సిటీకి అత్యంత భద్రత మధ్య తరలించడం జరుగుతుందన్నారు. పోలింగ్ మెటీరియల్ పంపిణీ, పోలింగ్ తరువాత ఈవీఎంల స్వీకరణ కోసం రిసెప్షన్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి మాట్లాడుతూ, ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్ఠభద్రతను ఏర్పాటు చేస్తామన్నారు. స్ట్రాంగ్‌రూమ్‌లు ఉన్న ప్రాంతాలను నిషేధిత ప్రాంతాలుగా ప్రకటించడం జరిగిందన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఏఎస్పీ ఎస్‌వీడి ప్రసాద్, డీఎస్పీలు, నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పర్యటనలో పాల్గొన్నారు.



మార్కెట్‌యార్డులో ఈవీఎం గోడౌన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ అద్నాన్

విజయవాడ బైపాస్ రైల్వేలైన్‌కు శంకుస్థాపన

» ముస్తాబాద నుంచి రాయనపాడు వరకు 21.6 కిలోమీటర్లు

» రూ.475 కోట్లతో నిర్మాణానికి ప్రధాని మోదీ శంకుస్థాపన

» గూడూరు-బిట్రగుంట-కార్వాడిల మధ్య థర్డ్‌లైన్ ప్రారంభం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ బైపాస్ లైన్‌కు రైల్వే శ్రీకారం చుట్టింది. ఇప్పటికే దీనికి సంబంధించిన పనులు ప్రారంభం కాగా.. మంగళవారం ప్రధాని మోదీ పనులకు శంకుస్థాపన చేశారు. విజయవాడ స్టేషన్‌కు టచ్ కాకుండా నేరుగా ముస్తాబాద నుంచి రాయనపాడు శాటిలైట్ స్టేషన్‌కు చేరుకునేలా విజయవాడ బైపాస్ లైన్ నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం రూ.475 కోట్లను ఖర్చు చేస్తోంది. విజయవాడ బైపాస్ లైన్ ముస్తాబాద నుంచి ప్రారంభమై గుణదల సమీపంలో ఆర్‌వోఆర్ మీదుగా నూతన లైన్ ద్వారా ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం నుంచి రాయనపాడు సమీపంలో అనుసంధానమౌతుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా ముస్తాబాద-గుణదల లైన్ల సమీపంలో రైల్ ఓవర్ రైల్ (ఆర్‌వోఆర్) బ్రిడ్జిని నిర్మిస్తారు. ఇప్పటికే దీనికి సంబంధించిన పనులను ముస్తాబాద-గుణదల మధ్య ప్రారంభించారు. ప్రాజెక్టుకు సంబంధించి ఆరు కిలోమీటర్ల మేర పనులు జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్టుకు అధికారికంగా ప్రధాని మోదీ మంగళవారం శంకుస్థాపన చేశారు. విజయవాడ బైపాస్ లైన్‌లో భాగంగా మొత్తం ఎనిమిది వంతెనలు, 10 మైనర్ వంతెనలు వస్తాయి. ఈ లైన్ వల్ల విజయవాడ స్టేషన్‌కు అనుసంధానం కాకుండానే అనేక రైళ్లను నేరుగా రాయనపాడుకు పంపించవచ్చు. రాయనపాడును ఇప్పటికే శాటిలైట్ స్టేషన్‌గా అభివృద్ధి చేసిన సంగతి తెలిసిందే. గుణదల స్టేషన్‌ను కూడా శాటిలైట్ స్టేషన్‌గా అభివృద్ధి చేస్తున్నారు. ఇదే మార్గంలో రైళ్లు ఆగి రాయనపాడు శాటిలైట్ స్టేషన్‌కు చేరుకుంటాయి. విజయవాడ స్టేషన్‌పై రద్దీ తగ్గించటానికి వీలుగా బైపాస్ లైన్‌కు కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది.



విజయవాడ బైపాస్ లైన్ వర్చువల్‌గా ప్రారంభిస్తున్న అధికారులు

ప్రధాని ప్రారంభోత్సవం చేసిన ప్రాజెక్టులు ఇవే..

గూడూరు-బిట్రగుంటల మధ్య రూ. 1243.92 కోట్ల వ్యయంతో 77 కిలోమీటర్ల మేర తలపెట్టిన థర్డ్‌లైన్ పనులను ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ మార్గంలో 16 మేజర్ బ్రిడ్జిలు, 160 మైనర్ బ్రిడ్జిలు, 2.1 కిలోమీటర్ల ఒక ఆర్‌వోఆర్, 12 నూతన రైల్వేస్టేషన్ల నిర్మాణం జరిగింది. ఈ స్టేషన్లలో రెండింటికి ఇప్పటికే హాల్టింగ్ కూడా ఇచ్చారు. బిట్రగుంట-కార్వాడిల మధ్య రూ.1576.83 కోట్ల వ్యయంతో 89 కిలోమీటర్ల మేర తలపెట్టిన లైన్ పనులను కూడా ప్రారంభించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా మేజర్ బ్రిడ్జిలు 31, మైనర్ బ్రిడ్జిలు 132, నూతన స్టేషన్లు 9 నిర్మించారు. కార్వాడి మధ్యన రూ.3280 కోట్ల వ్యయంతో 125 కిలోమీటర్ల మేర నిర్మించిన థర్డ్ లైన్‌కు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. 18 మేజర్ బ్రిడ్జిలు, 106 మైనర్ బ్రిడ్జిలు, 23 నూతన స్టేషన్లను నిర్మించారు. వీటిలో పది స్టేషన్లలో రైళ్లకు హాల్టింగ్ కూడా అమలు చేస్తున్నారు.



ప్రెస్‌మీట్‌లో పాల్గొన్న రైతు, కార్మిక సంఘాల నేతలు

రేపు మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు చేపట్టండి

» రైతు, కార్మిక సంఘాల నేతల పిలుపు

ధర్నాచౌక్, మార్చి 12 : సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు ఈ నెల 14న రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు, సభలు నిర్వహించాలని రైతు, కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. 14న ఢిల్లీలో జరిగే భారీ బహిరంగ సభకు రాష్ట్రం నుంచి అధిక సంఖ్యలో రైతులు, కార్మికులు పాల్గొనాలన్నారు. విజయవాడ గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి, కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక నేతలు మాట్లాడారు. రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను గత రెండేళ్లుగా కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని మండిపడ్డారు. రద్దు చేసిన వ్యవసాయ నల్లచట్టాలను దొడ్డిదారిన అమలు చేసేందుకు ప్రయత్నిస్తుందన్నారు. వ్యవసాయరంగం మొత్తాన్ని అదానీ, అంబానీలకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం పూనుకుందన్నారు. కార్మిక హక్కులను కాలరాసే నాలుగు లేబరు కోడ్‌లను తక్షణమే రద్దు చేయలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీతో టీడీపీ, జనసేన పొత్తుపెట్టుకోవడం సిగ్గుచేటన్నారు. రైతు సంఘం సీనియర్ నేత వైకేశవరావు, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి.ఓబులేసు, రైతు సంఘం నేత జి.ఈశ్వరయ్య పి.జమలయ్య, వి.కృష్ణయ్య, మరీదు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తిచేయండి

» జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక



జెడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఉప్పాల హారిక

మచిలీపట్నం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను సత్వరమే పూర్తిచేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అన్నారు. జెడ్పీ స్థాయిసంఘాల సమావేశాలు మంగళవారం జెడ్పీలో జరిగాయి. 1వ స్థాయిసంఘం సమావేశానికి అధ్యక్షత వహించిన హారిక మాట్లాడుతూ, జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని అన్నారు. ఆరోగ్యశ్రీ కార్డులను సాధ్యమైనంత త్వరగా ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థినీ, విద్యార్థులను చైతన్యవంతం చేయాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. మిచౌంగ్‌తుపాను కారణంగా పంటలు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం కొంతమందికి జమకాలేదని జెడ్పీటీసీ సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. రైతులందరికీ పరిహారం జమ అవుతుందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. ఏప్రిల్ మొదటివారంలో తాగునీటి అవసరాలకోసం కాలువలకు నీటిని విడుదల చేస్తారని, తాగునీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ గరికపాటి శ్రీదేవి, జెడ్పీ సీఈవో జ్యోతిబసు, డెప్యూటీ సీఈవో ఆనంద్‌కుమార్ చెందిన జెడ్పీటీసీ సభ్యులు, ఉమ్మడికృష్ణాజిల్లాల అధికారులు పాల్గొన్నారు.

స్పా కేంద్రాలపై దాడులు

విజయవాడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ, కృష్ణాజిల్లాలో రహస్యంగా నడుస్తున్న స్పా కేంద్రాలపై ఎస్ఈబీ పోలీసులు మంగళవారం మెరుపుదాడులు నిర్వహించారు. 62 మందితో కూడిన పది ప్రత్యేక బృందాలు పటమట, మాచవరం, పెనమలూరు, సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ఆరు స్పా కేంద్రాల్లో సోదాలు నిర్వహించాయి. థాయ్‌లాండ్ ఇతర దేశాల యువతులతో వ్యభిచారం చేయిస్తున్నట్టు నిర్ధారించారు. మొత్తం ఐదుగురు నిర్వాహకులను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. థాయ్‌లాండ్‌కు చెందిన ముగ్గురు యువతులతోపాటు 24 మంది మహిళలకు విముక్తిని కల్పించారు. ఈ కేంద్రాలను అరికట్టడంలో నిర్లక్ష్యం వహించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకుంటామని డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి స్పష్టం చేశారు.

కన్నతండ్రే కాటేశాడు!

» కూతురుపై పలుమార్లు లైంగిక దాడి!

» వీరవల్లిలో ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 12 : కంటికి రెప్పలా కాపాడాల్సిన తండ్రి కర్కశంగా ప్రవర్తించాడు. కన్నకూతురుపైనే లైంగికదాడికి ఒడిగట్టాడు. తల్లికి తన బాధను చెప్పుకోవటంతో కుమార్తెతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ట్రైనీ డీఎస్పీ వేదశ్రీ తెలిపిన వివరాల ప్రకారం.. వీరవల్లికి చెందిన బాలిక గ్రామంలో తొమ్మిదో తరగతి చదువుతోంది. గతేడాది డిసెంబరులో ఇంట్లో ఎవరూలేని సమయంలో కూతురుపై తండ్రి లైంగికదాడికి పాల్పడి.. విషయం ఎవరికీ చెప్పవద్దని, చెబితే చంపేస్తానని బెదిరించాడు. అప్పటి నుంచి పలుమార్లు బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక తన బాధను తల్లికి చెప్పుకోలేక, తండ్రిని నిలువరించలేక తల్లడిల్లింది. చివరకు జరిగిన దారుణాన్ని తల్లికి వివరించడంతో తల్లి భర్తను ప్రశ్నించింది. దాంతో పొంతన లేని సమాధానాలు చెప్పి ఇంటి నుంచి పారిపోయాడు. చివరికి తల్లి కుమార్తెతో కలిసి వీరవల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు బాలిక తండ్రి ఆచూకీ కోసం గాలింపుచర్యలు చేపట్టారు.



అవనిగడ్డ వైద్యశాల వద్ద ఆందోళన చేస్తున్న దివ్యశ్రీ బంధువులు

వ్యాన్ డ్రైవర్‌పై చర్యలు తీసుకోండి

» బాలిక బంధువుల ఆందోళన

అవనిగడ్డ, మార్చి 12 : మోపిదేవి మండలంలోని కొక్కిలిగడ్డ వద్ద కృష్ణానది కరకట్టపై వ్యాన్ ఢీకొని మృతి చెందిన బొడ్డు దివ్యశ్రీ మృతికి కారకులను వెంటనే అదుపులోకి తీసుకోవాలని బాలిక బంధువులు మంగళవారం అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాల వద్ద ఆందోళన చేపట్టారు. జనసంచార ప్రాంతంలో మితిమీరిన వేగంతో వ్యాన్ నడిపిన డ్రైవర్ బాలిక మృతికి కారకుడయ్యాడని దివ్యశ్రీ బంధువులు ఆరోపించారు. వెంటనే వ్యాన్ డ్రైవర్, ఓనర్‌ను అదుపులోకి తీసుకుని చట్టపరమైన చర్యలు చేపట్టాలని మృతురాలి బంధువులు, తల్లిదండ్రులు ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు.

డబ్బులు స్వాహా కేసులో జగదీష్‌తో ఎలాంటి సంబంధం లేదు

» ఐవీవై ఓవర్‌సీస్ యాజమాన్యం

విద్యాధరపురం, మార్చి 12 : యూకే వీసా ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి డబ్బులు స్వాహా చేసిన కేసులో జీపీఏ జగదీష్‌తో తమ సంస్థకు ఎలాంటి సంబంధం లేదని ఐవీవై ఓవర్‌సీస్ యాజమాన్యం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. జగదీష్‌ను తమ సంస్థ నుంచి 2020 డిసెంబరులోనే వ్యక్తిగత కారణాలతో తొలగించినట్టు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	112, 121, 132
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.33

ఫుట్‌పాత్‌ను ఆక్రమిస్తే చర్యలు: సీఐ



ఆక్రమణలు తొలగిస్తున్న సీఐ

హనుమాన్‌జంక్షన్, మార్చి 12 : ప్రధాన రహదారుల ఫుట్ పాత్ ఆక్రమణల తొలగింపుపై పోలీసులు చర్యలు చేప ట్టారు. మంగళవారం సీఐ నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఎస్సైలు జనార్దన్, అర్జమ్మ తదితర సిబ్బంది విజయవాడ, గుడివాడ, నూజివీడు రోడ్లలో ఫుట్‌పాత్ ఆక్రమణలు తీయించారు. ఫుట్‌పాత్‌ను ఆక్రమించి పాదచారులకు ఇబ్బంది కలిగిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని వ్యాపారస్తులను సీఐ హెచ్చరించారు.

సహజ వనరులు దోపిడీ

యథేచ్ఛగా అక్రమ మైనింగ్ ముస్తాబాదలో జరిగిన శంఖారావంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు



ముస్తాబాదలో మహిళలతో మాట్లాడుతున్న యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, మార్చి 12 : వైసీపీ పాలనలో సహజ వనరుల దోపిడీ పెరిగిపోయిందని, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. అక్రమ మైనింగ్ నేటికి యథేచ్ఛగా సాగిస్తున్నా అధికారులకు ఏమాత్రం పట్టడం లేదన్నారు. టీడీపీ అధికా రంలోకి వచ్చాక అక్రమ మైనింగ్, దొంగ ఇళ్ల పట్టాలు, ఎసైన్డ్ భూముల విక్రయాలపై విచారణ జరిపించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోంటామని హెచ్చరించారు. మండలంలోని ముస్తాబాదలో శంఖారావం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. టీడీపీ-జనసేన శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని సందడి చేశారు. ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి యార్లగడ్డ నివాళులర్పించారు. ఇంటింటికీ వెళ్లి మొదటి విడత మ్యానిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. మహిళలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అడుగడుగునా వెంకట్రావుకు మహిళలు హారతులు పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వృద్ధులకు, వితంతువులకు పెన్షన్‌ల పథకాన్ని ప్రవేశపెట్టిన ఘనత టీడీపీదేనని చెప్పారు. పేదలకు ఆరున్నర లక్షల ఇళ్లు నిర్మించటంతో పాటు మరో 13లక్షల కుటుంబాలకు ఇళ్ల స్థలాలను ఎన్‌టీఆర్ ప్రభుత్వం పంపిణీ చేసిందని గుర్తు చేశారు. ప్రజలందరూ టీడీపీ జనసేన కూటమికి మద్దతు పలకాలని కోరారు. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్న, బోడపాటి రవి, మేడేపల్లి రమా, పాలడుగు మల్లికార్జునరావు, మేడేపల్లి కాంతారావు, కంచర్ల ఈశ్వరరరావు, కొసరాజు సాయిరాం, షేక్ అబు ల్యాజ్, గరిమెళ్ల కృష్ణార్జునరావు, కోనేరు రమామణి, చట్టు నాగమణి, పిన్నిబోయిన వెంకటేశ్వరమ్మ, గుంటూరు ప్రసాద్, పాటిబండ్ల కిరణ్, మేడేపల్లి సురేష్, పలగాని కళ్యాణ చక్రవర్తి, పల్లి కార్తీక్, కూరేటి వాసు, కలపర్తి అనిల్, సతీష్ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

ముస్తాబాదకు చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు యార్లగడ్డ వెంకట్రావు సమక్షంలో టీడీపీలో చేరారు. వార్డు సభ్యుడు పాలడుగు రత్నారావు, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ కడియాల రామారావు, బి.సుకన్య, కె.కరుణ్‌బాబు, కె.వెంకన్న, జె.శివకృష్ణ, అఖిలేష్, కృష్ణవేణి, సలీం, సురేంద్ర, రంగమ్మ, ఆర్.ఉదయ్‌కుమార్, మల్లంపల్లి పవన్‌కుమార్, తిరుమలరాజుతో పాటు పలు కుటుంబాలు టీడీపీలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.



ఆర్‌బీకే వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

ధాన్యం సొమ్ము చెల్లించాలి

నున్న ఆర్‌బీకే వద్ద రైతుల నిరసన

విజయవాడ రూరల్, మార్చి 12 : ఖరీఫ్ పంటకు సంబంధించి రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన ధాన్యం సొమ్ము తక్షణమే చెల్లించాలని నున్న గ్రామ రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నున్న ఆర్‌బీకే వద్ద బైఠాయించి రైతులు తమ నిరసన వ్యక్తం చేశారు. రైతుల నిరసనపై స్పందించిన మండల వ్యవసాయ మండలి అధ్యక్షుడు యార్కారెడ్డి నాగిరెడ్డి, అధికారులు రైతులతో సమావేశమయ్యారు. బకాయిల చెల్లింపు త్వరలోనే జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు నిరసన విరమించారు.

మంచం పట్టిన యువకుడికి ఆర్థిక సాయం

పెనమలూరు, మార్చి 12 : ఒక యువకుడు గత నాలుగేళ్లుగా జే బ్రాండ్ మద్యం సేవిస్తుండడంతో చేతులు కాళ్లు పడిపోయి మంచానికే పరిమితమైన కుటుంబానికి టీడీపీ యువనేత రెహమాన్ మంగళవారం ఆర్థిక సాయాన్ని అందించారు. కానూరు సనత్‌నగర్‌కు చెందిన దుర్గాప్రసాద్ (20) నాలుగేళ్లుగా పెయింట్ పనులకు వెళు తూ మిత్రులతో కలిసి జే బ్రాండ్ మద్యం సేవిస్తున్నాడు. ఈ క్రమంలో అతని బ్రెయిన్‌లో బ్లడ్‌క్లాట్ అయి కొన్ని నెలలుగా మంచానికే పరిమితమయ్యాడు. తల్లిదండ్రులు రోజువారీ కూలీలు. ఇతని పరిస్థితి తెలుసుకొన్న టీడీపీ యువనేత రెహమాన్, అతని మిత్రులు వైద్య ఖర్చుల నిమిత్తం ముప్పైవేలు అందజేశారు.

పోలీసుల కవాతు

ఉయ్యూరు, మార్చి 12 : సాధారణ ఎన్నికల ప్రక్రియ సమీపిస్తున్న తరుణంలో ఏవిధమైన సందేహాలకు లోను కాకుండా ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని తెలియజేస్తూ ఉయ్యూరు, గండిగుంట, కాటూరు, ముదునూరు గ్రామాల్లో మంగళవారం పోలీసు ప్రత్యేక దళం కవాతు నిర్వహించింది. పట్టణ సీఐ హబీబ్ బాషా, ఎస్సై గణేశ్‌కుమార్, రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై అవినాశ్ సిబ్బంది పాల్గొన్నారు.

సైకిల్ షెడ్డు ప్రారంభం



షెడ్డును ప్రారంభిస్తున్న కెనరా బ్యాంకు డీజీఎం పొట్లూరి సుమలత

గన్నవరం, మార్చి 12 : స్థానిక బాలికల ఉన్నత పాఠశాలకు కెనరా బ్యాంకు సౌజన్యంతో సైకిల్ షెడ్డు, పది టేబుల్స్, పది కుర్చీలను మంగళవారం అందజేశారు. సైకిల్ షెడ్డును కెనరా బ్యాంకు డీజీఎం పొట్లూరి సుమలత ప్రారంభించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువులో రాణించి ఉన్నతంగా ఎదగాలని సూచించారు. రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు చిన్ని మాధవి, రిటైర్డ్ ఉపాధ్యాయుడు సాంబశివరావు, కెనరా బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

మానవతకు విరాళం

హనుమాన్‌జంక్షన్, మార్చి 12 : స్థానిక మానవత సంస్థ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు తన వంతు సాయంగా జంక్షన్‌కు చెందిన పల్లపోతు శ్రీను తన తల్లిదండ్రులు నాగేశ్వరమ్మ, నాగేశ్వరరావు జ్ఞాపకార్థం మంగళవారం రూ.25వేలు విరాళం అందజేశారు. మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు చేతులు మీదుగా విరాళాన్ని శాఖ నిర్వాహకులకు అందించారు. ఈ కార్యక్రమంలో సుబ్బాచారి, నారాయణరావు, వేగిరెడ్డిసూర్యనారాయణ, సత్యనారాయణ, చెక్కా సుబ్బారావు, శ్రీరామమూర్తి, వడ్డి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పదజాలంపై పట్టుకే పోటీలు



విజేతలతో అప్సా జిల్లా అధ్యక్షుడు గౌరీప్రసాద్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 12 : విద్యార్థుల్లో పదజాలంపై నైపుణ్యం, భావజాల నైపుణ్యం పెంపొందించుకునేందుకు స్పెల్‌బీ పోటీలు ఉపయోగపడతాయని ఏపీపీఎస్‌ఏ జిల్లా అధ్యక్షుడు గౌరీప్రసాద్ అన్నారు. వీరవల్లి గీతాంజలి హైస్కూల్‌లో అప్సా (ఏపీపీఎస్‌ఏ) గన్నవరం డివిజన్ ఆధ్వర్యంలో 1నుంచి 10వ తరగతి వరకు 11 పాఠశాలల్లోని విద్యార్థులకు స్పెల్‌బీ పోటీలు నిర్వహించారు. విజేతలకు మంగళవారం బహుమతులు అందజేశారు. డివిజన్ స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలు జిల్లాస్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ బి. శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి వీడీఎస్ ప్రసాద్, గీతాంజలి హైస్కూల్ కరస్పాండెంట్ ఆర్. మదన్‌మోహన్, జిల్లా కోశాధికారి ఎస్. పూర్ణచంద్రాచార్యులు పాల్గొన్నారు.



దివ్యపూజాబలిని సమర్పిస్తున్న తెలగతోటి రాజారావు, పలువురు మేత్రానులు

మహిమాన్వితుడు బ్రదర్ జోసఫ్ తంబి

విజయవాడ మేత్రానులు తెలగతోటి రాజారావు

ఉంగుటూరు, మార్చి 12 : మహిమాన్వితుడు బ్రదర్ జోసఫ్ తంబి అని విజయవాడ మేత్రానులు(పీఠాధిపతి) తెలగతోటి రాజారావు అన్నారు. పునీత పట్టంలో భాగంగా విజయవాడ మేత్రాసన స్థాయి విచారణ ముగింపు వేడుకలు స్థానిక తంబి పుణ్యక్షేత్ర ప్రాంగణంలో ఘనంగా జరిగాయి. సోమవారం సాయంత్రం నుంచి ప్రారంభమైన విచారణ ముగింపు ప్రక్రియ మంగళవారం తెల్లవారు జామువరకు కొనసాగింది. ఈ వేడుకలకు ఆయన అధ్యక్షత వహించి, దివ్యపూజా బలి సమర్పించారు. అనంతరం జోసఫ్ తంబి జీవిత విశేషాల గురించి సందేశంలో వివరించారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం విశ్రాంత మేత్రానులు మల్లవరపు ప్రకాష్, గుంటూరు మేత్రానులు చిన్నాబత్తిని భాగ్యయ్య, మేరీమాత కపూచిన్ ప్రొవిన్షియల్ ఫాదర్ మరియదాసు, విజయవాడ మేత్రాసన ఛాన్స్‌లర్ ఫాదర్ ఆనంద్, వికార్ జనరల్ మెస్సం గాబ్రియేలు, గుణదల పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ జయరాజు, తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి విచ్చేసిన ఫాదర్ లారెన్స్, ఫాదర్ జార్జ్ ఆంథోని, ఫాదర్ చెరియన్ స్కరియ, తంబి భక్తులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు యార్లగడ్డ విరాళం

తేలప్రోలులోని ఆర్‌సీఎం చర్చి ఉత్సవాలకు గన్నవరం నియోజకవర్గ టీడీపీ-జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు రూ. 10వేలు విరాళం ఇచ్చారు. ఉత్సవాల విశిష్టతను గ్రామ నాయకులు యార్లగడ్డకు వివరించారు. స్పందించిన ఆయన విరాళాన్ని పార్టీ నాయకులకు పంపారు. గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు భీమవరపు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు రాజబోయిన శివాజీ, నిమ్మకూరి మహేష్, వంగా అయ్యప్పరెడ్డి, గులిపల్లి సందీప్, పులపాక చలపతి తదితరులు చర్చి పాదర్ గోళ్ల విజయకుమార్‌కు అందజేశారు.

పాకల తొలగింపుపై మహిళల ఆందోళన



ఆందోళన చేస్తున్న మహిళలు

ఉయ్యూరు, మార్చి 12 : గురజాడ డొంకలో క్రైస్తవ సమాధు ల స్థలం వద్ద రోడ్డు పక్కన ఉన్న ఇళ్లను అధికారులు తొలగించడాన్ని నిరసిస్తూ బాధితులు, ఆ ప్రాంత మహిళలు మంగళవారం ఆందోళనకు దిగారు. రోడ్డుపక్కన ఇళ్లు వేసుకుని ఎన్నో సంవత్సరాలుగా నివసిస్తుంటే సమాధులకు వెళ్లే దారిలో అడ్డుగా ఉన్నాయని అధికా రులు తొలగించారని, ఉన్న ఇళ్లు తొలగించడంతో మేము ఎక్కడ ఉండాలని, అడ్డుగా లేని చోట పాకలు వేసుకోనివ్వకపోతే పురుగుల మందు తాగి చస్తామం టూ రోడ్డుపై టెంట్ వేసుకుని పురుగు మందు డబ్బాతో బైఠాయించారు. సమాధుల స్థలం దాటి రోడ్డువరకు శవాలు ఖననం చేస్తూ ఇళ్లపక్కనే సమాధులు కడుతు న్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాధులకు వెళ్లే దారిలో పెరిగిన పొదలు, చెత్త నగర పంచాయతీ కమిషనర్ వెంకటేశ్వరరావు సిబ్బందితో తొలగించి శుభ్రం చేయించారు. సర్వేయర్‌తో ఆ స్థలం సర్వే చేయించి ఎవరికి ఇబ్బంది లేకుండా చూస్తామని సర్ది చెప్పారు.

టీడీపీ బ్యానర్ చించివేత



బోస్ బొమ్మ సెంటర్‌లో చించేసిన బ్యానర్

గన్నవరం, మార్చి 12 : స్థానిక బోస్ బొమ్మ సెంటర్‌లో టీడీపీ నాయకులు కాసన్నేని రాజా ఏర్పాటు చేసిన బ్యానర్‌ను మంగళవారం చించివేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, నారా లోకేష్‌తో పాటు యార్లగడ్డ వెంకట్రావు, పలువురు టీడీపీ ముఖ్య నాయకుల ఫొటోలతో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ బ్యానర్‌ను ఏర్పాటు చేయగా వైసీపీకి చెందిన వారు చించివేశారని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన బ్యానర్‌ను చించివేయటం రెండవ సారి. నియోజకవర్గంలో టీడీపీకి పెరుగుతున్న ప్రజాదారణ చూసి ఓర్వలేకపోతున్న వైసీపీ నాయకులు బ్యానర్‌లను చించివేస్తున్నారని మండిపడ్డారు. ఎన్ని వికృత చేష్టలు చేసిన యార్లగడ్డ గెలుపును ఆపలేరని, వచ్చేది టీడీపీ ప్రభుత్వామేనని తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని పలువురు టీడీపీ నాయకులు హెచ్చరించారు.

ఎక్కువ మంది మహిళల్లో డీ విటమిన్ లోపం

అపోలో వైద్యులు డాక్టర్ సిద్ధార్థ పొట్లూరి

పెనమలూరు, మార్చి 12 : తొంభై శాతం భారతీయ స్త్రీలు విటమిన్ డీ లోపంతో బాధపడుతున్నారని హైదరాబాద్ అపోలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సిద్ధార్థ పొట్లూరి పేర్కొన్నారు. విజయవాడలో జరిగిన ఒక ప్రత్యేక వైద్య శిబిరంలో ఆయన మాట్లాడుతూ, తాత్కాలిక నొప్పి ఉపశమన పరిష్కారాలను మహిళలు ఆశ్రయిస్తూ ఎముకల నొప్పిని సాధారణంగా చూస్తున్నారని వ్యాఖ్యానించారు. విటమిన్ డీ లోపం వల్ల ఎముకల ఆరోగ్యం దెబ్బ తింటుందని ఎముకల నొప్పి, పగుళ్లకు కారణమవుతుందని పేర్కొన్నారు. విటమిన్‌డీ కోసం కనీసం 20 నిముషాలు ఎండలో ఉండేలా సూచుకోవాలని సూచించారు.

ఎన్‌టీటీఎఫ్ వైస్ చైర్మన్ రేగురాజ్‌కు నివాళి

గన్నవరం, మార్చి 12 : ఎన్‌టీటీఎఫ్ గన్నవరంలో స్థాపించి ఎంతో మందికి మంచి భవిష్యత్ కల్పించిన ఎన్‌టీటీఎఫ్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.రేగురాజ్ మృతి బాధాకరమని ప్రిన్సిపాల్ డి.మహిధర్ అన్నారు. స్థానిక ఎన్‌టీటీఎఫ్ కళాశాలలో మంగళవారం డాక్టర్ ఎన్.రేగురాజ్ సంతాప సభ నిర్వహించారు. ఏవో పద్మజ, ట్రైనీస్ అంజలి తదితరులు పాల్గొన్నారు.

పోరంకిలో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో బోడె ప్రసాద్

పెనమలూరు, మార్చి 12 : రంజాన్ మాస ఆరంభ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. పోరంకి మసీదులో ముస్లింతో ఆయన స్వయంగా విందులో పాల్గొనగా నియోజకవర్గంలోని అన్ని మసీదులకు చెందిన ముస్లింలకు మిఠాయిల ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అనుమోలు ప్రభాకరరావు, షేక్ బుజ్జి, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే యువతకు భవిష్యత్తు

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : రాష్ట్రాభివృద్ధితో పాటు యువత బంగారు భవిష్యత్తుకు టీడీపీ-జనసేన ప్రభుత్వ ఏర్పాటు చేసే విధంగా యువత సైనికుల్లా పోరాటం చేయాలని తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి గుండపనేని ఉమావరప్రసాద్ దిశానిర్దేశం చేశారు. వీరవల్లి తెలుగు యువత ఆధ్వర్యంలో మంగళవారం టీడీపీ కార్యాలయంలో తెలుగు యువత ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసేందుకు టీడీపీ-జనసేన కార్యకర్తలందరూ సమష్టిగా సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో మండాది రవీంద్ర, లంక అజయ్, అమృతపల్లి సూర్య నారాయణ, కగ్గా రామకృష్ణ, సభ్యులు రాయి సాయి, నాగరాజు, జనసేన యువత పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి టీడీపీ, జనసేనను గెలిపించాలి

హనుమాన్‌జంక్షన్, మార్చి 12 : వైసీపీ పాలన లో దిగజారిపోయిన రాష్ట్రాభివృద్ధి తిరిగి చంద్రబాబు నాయకత్వంలోనే గాడినపడుతుందని రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం హనుమాన్‌నగర్‌లో పట్టణ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ -భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి, వడ్లిల్లి లక్ష్మి, గార్లపాటి రాజేశ్వరరావు, యార్లగడ్డ సత్యనారాయణ, వీరమాచినేని బుజ్జి, వార్డు సభ్యులు తాడిశెట్టి శ్రీను, కడవకొల్లు రాజేష్, పోతుమర్తి సత్యనారాయణ, వల్లభనేనినాగమణి జనసేన మండల అధ్యక్షుడు వడ్డి శివనాగేశ్వరరావు, వీర మహిళలు ప్రసన్న, పరుచూరి సుజని పాల్గొన్నారు.

టీడీపీ నేతలు

ముదునూరు(ఉయ్యూరు) : తెలుగుదేశం, జనసేన, బీజేపీ కలయికతో ఏర్పడే ప్రభుత్వంతో రాష్ట్రం అభివృద్ధి బాటలోకి రావడం తథ్యమని తెలుగుదేశం పార్టీ పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బోడె ప్రసాద్ తనయుడు బోడె వెంకట్రామ్ అన్నారు. బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ముదునూరులో మంగళవారం నాల్గవ రోజు పర్యటించారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓట్లు వేసి బోడె ప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు దూసర అజయ్‌కుమార్, బీసీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్ రంగారావు, జ్ఞానశేఖర్, బొబ్బా ప్రవీణ్, అశోక్, వినీల, నాగరాజుపాల్గొన్నారు.


పెదపులిపాకలో బోడె హేమ పాదయాత్ర

పెనమలూరు : మండలంలోని పెదపులిపాకలో మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సతీమణి బోడె హేమ పాదయాత్ర నిర్వహించి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె గ్రామంలోని ప్రజలను కలుస్తూ టీడీపీని బలపరచాలని, వచ్చే ఎన్నికల్లో బోడె ప్రసాద్‌ను ఎమ్మెల్యేగా, చంద్రబాబును ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని కోరారు. టీడీపీ మేనిఫెస్టోను విస్తృతంగా ప్రచారం చేశారు. ఆమె వెంట గ్రామ టీడీపీ అధ్యక్షుడు ముసునూరి శ్రీనివాస్, గుజ్జర్లపూడి బాబూరావు, ముసునూరి నిర్మల్, శ్రీధర్, తుమ్మల రామ్‌కుమార్, పోలవరపు కుమార్, కుర్రా వీరకుమార్, నాగూర్, చందు, మధు, ధనేకుల రాధిక, రాణి, పులిపాక సాయి, నాగరాజు, భాను, లక్ష్మి ఉన్నారు.

యార్లగడ్డ సుచిత్ర ఆధ్వర్యంలో

కానూరు కేసీపీ కాలనీలో తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర ఆధ్వర్యంలో టీడీపీ మేనిఫెస్టోపై విస్తృత ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని బలపరచాలని కోరారు. ఆమె వెంట టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	112, 121, 132
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.33

నారాయణం విజయలక్ష్మికి కవయిత్రి మొల్ల పురస్కారం



గుడివాడ/గుడ్లవల్లేరు : తెలుగు బాషా వికాస సమితి సమన్వయకర్త డిఆర్‌బి ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రముఖ ఆధ్యాత్మిక రచయిత్రి నారాయణం విజయలక్ష్మికి కవయిత్రి మొల్ల పురస్కారాన్ని మంగళవారం ప్రదానం చేశారు. గుడివాడలోని షాగులాబ్ చంద్ గ్రంథాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి టూటౌన్ సీఐ దుర్గారావు పాల్గొన్నారు. మొల్ల రచించిన రామాయణం ఎంతో ప్రసిద్ధిగాంచిం దన్నారు. తాడిపర్తి సునీత, నారాయణం శ్రీనివాసమూర్తి, జె.వి.కుమారి, గ్రంథాలయ అధికారి బీరం వెంకటరమణ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



వెంట్రప్రగడలో కేంద్ర బలగాలతో కలిసి పోలీసులు కవాతు

గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు

పెదపారుపూడి : కేంద్ర బలగాలతో కలిసి పెదపారుపూడి పోలీసులు పెదపారుపూడి, మోపర్రు, ఎలమర్రు, వెంట్రప్రగడ, వానపాముల గ్రామాల్లో మంగళవారం కవాతు నిర్వహించారు. సీఐ శుభాకర్ మాట్లాడుతూ ఎన్నికలు వస్తున్న తరుణంలో శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా కవాతు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. కేంద్ర పోలీసు బలగాలతోపాటు పెదపారుపూడి ఎస్సై జి.రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువు మట్టి అమ్మేసుకుంటున్న వైసీపీ నేత

పెదపారుపూడి : గ్రామాల్లో పంచాయతీలకు ఆదాయ వనరులుగా ఉండాల్సిన చేపల చెరువులు అధికార పార్టీ నాయకులకు కాసులు కురిపిస్తున్నాయి. మహేశ్వరపురం గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకుండా పంచాయతీ తీర్మానం చేయకుండా అధికార పార్టీ నేత పంచాయతీ చెరువు మట్టి అమ్ముకుంటున్నా అధికారులు కన్నెత్తి చూడకపోవటం గమనార్హం. గత రెండు రోజులుగా ఎక్స్‌కవేటర్లు పెట్టి ట్రాక్టర్ మట్టి రూ.1000 నుంచి రూ.1500లకు అమ్ముకుంటున్నారు. లక్షలాది రూపాయల మట్టి తరలిపోతున్నా అధికారులు ఏం చేయలేకపోతున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా మట్టి తవ్వకాలు జరుగుతున్న విషయమై ఉన్నతాధికారులు స్పందించి తవ్వకాలు నిలుపుదల చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి చైతన్య శ్రీనివాస్‌ను వివరణ కోరగా, తన దృష్టికి వచ్చిందని, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



మహేశ్వరపురం గ్రామంలోని పంచాయతీ చెరువు మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు

బీసీల అభ్యున్నతి టీడీపీ, జనసేనతోనే సాధ్యం

మచిలీపట్నం టౌన్ : చంద్రబాబు ప్రకటించిన బీసీ డిక్లకేషన్‌లో సూర్య బలిజలకు తగిన ప్రాధాన్యత కల్పించడం ముదావహమని టీడీపీ సూర్యబలిజ బిసి సాధికారత రాష్ట్ర కన్వీనర్ చిత్తజల్లు నాగరాము అన్నారు. టీడీపీ కార్యాలయం వద్ద మంగళవారం చంద్రబాబు, కొల్లు రవీంద్ర, పవన్‌కల్యాణ్ చిత్రపటా లకు పాలాభిషేకం చేశారు. సూర్యబలిజ సామాజిక చారిత్రక విశిష్టత పుస్తకాన్ని చిత్తజల్లు నాగరాము తదితరులు ఆవిష్కరించారు. నాయకులు గంపల రవితేజ, నాంచారయ్య, చదలవాడ సాయి చరణ్, సికినం సుబ్బారావు, దినేష్, జానకి రామ్, నాగతేజ, సూర్యతేజ పాల్గొన్నారు.



సూర్యబలిజ సామాజిక చారిత్రక విశిష్టత పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చిత్తజల్లు నాగరాము

గుడివాడ రైల్వే స్టేషన్లో ఒకే స్టేషన్-ఒకే ఉత్పత్తి షాపు



గుడివాడ : చేతివృత్తుల వారిని ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో ప్రధాన మోదీ విశ్వకర్మ యోజన పథకం కింద ప్రతి రైల్వేస్టేషన్‌లో చేతి వృత్తుల తయారీ వస్తువుల అమ్మకానికి దుకాణాలను ప్రారంభిస్తున్నారని బీజేపీ నేత దావులూరి సురేంద్ర అన్నారు. రైల్వేస్టేషన్‌లో ఒకే స్టేషన్-ఒకే ఉత్పత్తి కార్యక్రమంలో భాగంగా రైల్వే అధికారులతో కలిసి దుకాణాన్ని ప్రారంభించారు. పట్టణ బీజేపీ అధ్యక్షుడు ఎర్రపోతు అర్జున్, గుడివాడ రైల్వేస్టేషన్ మాస్టర్ డి.రమేష్‌బాబు, సీసీఐ భగవాన్‌నాయక్, కొత్త కిరణ్, రాంప్రసాద్, వెంకటరమణ పాల్గొన్నారు.



గుడివాడ రెండో వార్డులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న వెనిగండ్ల రాము



నిడుమోలులో టీడీపీలో చేరిన ప్రముఖులతో కుమార్ రాజా



గూడూరు ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కాగిత కృష్ణప్రసాద్

అక్రమాల వైసీపీని తరిమి కొట్టాలి

గుడివాడ, మార్చి 12 : దేశ, రాష్ట్ర రాజకీయాల గురించి మాట్లాడే ఎమ్మెల్యే కొడాలి నాని నియోజకవర్గాన్ని ఎందుకు అభివృద్ధి చేయలేకపోయాడో చెప్పాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము సవాల్ విసిరారు. రెండో వార్డులో వెనిగండ్ల ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వార్డు పెద్దలు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో వెనిగండ్ల మాట్లాడుతూ ప్రజల నుంచి ఛీత్కరింపులు ఎదురవుతాయనే భయంతోనే ప్రజల కనపడకుం డా నాని తప్పించుకుని తిరుగుతున్నాడని విమర్శించారు. అక్రమాల వైసీపీ నాయకులను తరిమి తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. నాని మాటల గారడీ విని గుడివాడ ప్రజలు విసిగివేసారి పోయారన్నారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, యలవర్తి శ్రీనివాసరావు, దింట్యాల రాంబాబు, మజ్జి శ్రీనివాసరావు, పొట్లూరి వెంకట కృష్ణారావు, వసంతవాడ దుర్గారావు, అక్కినేని రాధాకృష్ణ, లోయ వాసు, తుమ్మల ప్రభాకర్, కొల్లు విశ్వేశ్వరరావు, మెరుగుమాల స్వామి, కొడాలి రామరాజు, కొదమల గంగాధర్, లింగం ప్రసాద్, ముళ్ళపూడి రమేష్‌చౌదరి, పోలాసి ఉమా పాల్గొన్నారు.

మాదిగలకు అండగా ఉంటా : వెనిగండ్ల

గుడివాడ : మాదిగలకు అండగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. మాదిగల ఆత్మీయ సమావేశంలో సోమవారం రాత్రి ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వపరంగానే కాకుండా వ్యక్తిగతంగా కూడా సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, పిన్నమనేని బాబ్జీ, యలవర్తి శ్రీనివాసరావు, దింట్యాల రాంబాబు, కంచర్ల సుధాకర్, కొడాలి రామరాజు, కొదమల గంగాధర్, ఇంటూరి గజేంద్ర, అద్దంకి మాణిక్యాలరావు, వి.కిరణ్, రావెల ప్రభాకరరావు, బొల్ల త్యాగరాజు, జుజ్జవరపు ప్రభాకరరావు, గుడివాడ జోన్స్, జుజ్జవరపు వీరభద్రరావు, బుల్లాకింగ్, వెశపోగు ఇమ్మానియేలు, పమ్మిడి ముక్కల వంశీచ మరియబాబు, జయరాజు, కాటూరి ఏసుపాదం, దానియేలు, శాంసన్, పరిసిపోగు పోలయ్య, సురేంద్ర పాల్గొన్నారు.

50 కుటుంబాలు టీడీపీలోకి చేరిక

కూచిపూడి : పల్లెబాట కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. పామర్రు నియోజకవర్గ ఇంచార్జ్ వర్ల కుమార్ రాజా నేతృత్వంలో నిడుమోలు గ్రామానికి చెందిన 50 కుటుంబాలు మంగళవారం టీడీపీలో చేరారు. పార్టీ కండువాలు కప్పి కుమార్ రాజా ఆహ్వానించారు. గ్రామాల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేయనున్నట్లు కుమార్‌రాజా తెలిపారు. నన్నపనేని వీరేంద్ర, వీరంకి గురుమూర్తి, లింగమనేని రామలింగేశ్వరరావు, వీరంకి తులసీదాస్, గొంతుపులి రాము, వెంకటేశ్వరరావు, తాడిశెట్టి నరేష్, రొండి కృష్ణ యాదవ్, జొన్నలగడ్డ రవి, మస్తాన్, షరీఫ్, రాజేంద్ర ప్రసాద్, వీర్ల నరేష్, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ అంతం - దళితుల పంతం

● మాచవరపు ఆదినారాయణ

మచిలీపట్నం టౌన్ : మోసపూరిత హామీలతో దళితుల ఓట్లను కొల్లగొట్టిన జగన్మోహనరెడ్డికి రానున్న ఎన్నికల్లో దళితులు తమ సత్తా చూపిస్తారని జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మాచవరపు ఆదినారాయణ అన్నారు. మచిలీపట్నం పార్లమెంటు టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అంబేడ్కర్ విదేశీ విద్యను, బెస్ట్ అవైలబుల్ పాఠశాలలను ఎందుకు రద్దు చేశారో తెలియజేయాలన్నారు. టీడీపీ హయాంలో దళితుల సంక్షేమం కోసం 27 పథకాలను చంద్రబాబు ప్రవేశపెట్టారని, వాటిని జగన్ రద్దు చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్ళించారన్నారు. వేలాది బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయలేదన్నారు. జగన్‌రెడ్డి పాలనలో దళితులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రానున్న ఎన్నికల్లో దళితవాడల్లోకి వైసీపీ అభ్యర్థులను తిరగనీయమన్నారు.

రాష్ట్రాభివృద్ధి కోసమే ఉమ్మడి పోరాటం : కాగిత

పెడన రూరల్ : వైసీపీ పాలనలో ప్రజలపై పన్ను భారాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని పెడన నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. గూడూరులో కృష్ణప్రసాద్ అధ్యక్షతన మండల స్థాయి టీడీపీ, జనసేన, బీజేపీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అభివృద్ధిని కాంక్షించి మూడు పార్టీలు కలిసి పనిచేస్తున్నాయన్నారు. రానున్న ఎన్నికలలో వైసీపీని తరిమి తరిమి కొట్టాలన్నారు. ప్రజలకు జనరంజకమైన పాలన అందించేందుకు ఉమ్మడి ప్రణాళిక రూపకల్పన జరుగుతుందన్నారు. జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త పంచకర్ల సురేష్, బిజెపి నాయకులు వీర్ల కృష్ణ, పరిశీలకులు సాదరబోయిన ఏడుకొండలు, కోళ్ళపల్లి రజని, దాపరి సాయి, అన్నం హరిరామకృష్ణ, కాసగాని శ్రీనివాసరావు, కట్టా మునేశ్వరరావు, గోపి నాగబాబు, గోరిపర్తి ఫణిరాజు, ఎన్ఎ బేగ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సాతులూరులో శిరీష పర్యటన

బంటుమిల్లి : సాతులూరులో నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ సతీమణి కాగిత శిరీష ఇంటింటా తిరిగి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కాగిత కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. టీడీపీ, జనసేన మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఇల్లూరి లీలాకృష్ణ, అంగర రంగనాథ్, రేవు గోపాలకృష్ణ, యార్లగడ్డ శ్రీను, బొర్రా కాశీ, తెనాలి సుధాకర్, నాగబాబు, కుమార్, జనసేన నాయకులు వెంట్రపాటి నాగబాబు, రాంబాబు, నారంగం శ్రీదేవి, దాసరి కరుణజ్యోతి, నాగమల్లేశ్వరమ్మ, సన్నాల రాజారావు, రమేష్, జరీనా పాల్గొన్నారు.



సాతులూరులో బాబు ష్యూరిటీ కార్యక్రమంలో కాగిత శిరీష



ధాన్యం నగదు చెల్లించాలి : రైతుల ఆందోళన



ఘంటసాల, మార్చి 12 : ధాన్యం నగదు చెల్లించాలని డిమాండ్ చేస్తూ పాపవినాశనం రైతులు మంగళవారం రైతు భరోసా కేంద్రం వద్ద ఆందోళన చేశారు. రైతులు మాట్లాడుతూ జనవరి నెలలో అమ్మిన ధాన్యానికి నగదు ఇవ్వకపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఎన్నికల కోడ్ సమీపిస్తున్న నేపథ్యంలో ఈ ప్రభుత్వంలో నగదు అందకపోతే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వంద మంది రైతులకు నగదు జమ కాలేదన్నారు. అధికారులు తక్షణమే స్పందించి నగదు జమ అయ్యేలా చూడాలని కోరారు. రైతులు కుంపటి చిట్టిబాబు, సుంకర వెంకటేశ్వరరావు, గుత్తికొండ హరికృష్ణ, ఈడ్పుగంటి శివరామ కృష్ణ ప్రసాద్, మురాల సుబ్రహ్మణ్యం, సుంకర వీరయ్య చౌదరి, సుంకర ప్రవీణ్, బుర్రే నాగార్జున, తాడంకి నీలాంబరం తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి మేనిఫెస్టోలో బ్రాహ్మణులకు సముచిత స్థానం



మచిలీపట్నం టౌన్ : టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి మేనిఫెస్టోలో బ్రాహ్మణులకు సముచిత స్థానం కల్పించడం జరుగుతుందని బ్రాహ్మణ సాధికార సమితి జిల్లా కన్వీనర్ పి.వి. ఫణికుమార్ తెలిపారు. మంగళగిరి టీడీపీ సెంట్రల్ కార్యా లయంలో రాష్ట్ర కన్వీనర్ బుచ్చి రామప్రసాద్‌తో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశం వివరాలను మంగళవారం ఆయన విలేకరు లకు వివరించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా ఒక్క రూపాయి కూడా నిధులను పేద బ్రాహ్మణులకు ఇవ్వ లేదన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బ్రాహ్మణులకు సబ్సిడీ రుణాలు, విదేశీ విద్యకు నిధులు అందస్తామన్నారు. అర్చకులకు హెల్త్‌కార్డులు ఇస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో బ్రాహ్మణ సాధికార సమితి ఆయా నియోజకవర్గాల టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామన్నారు.

కూచిపూడి పోలీస్‌స్టేషన్‌కు పదో తరగతి ప్రశ్నపత్రాలు

కూచిపూడి : ఈనెల 18వ తేదీ నుంచి జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షల ప్రశ్నప్రతాలు మంగళవారం పోలీస్ స్టేషన్‌లకు చేరాయి. మొవ్వ మండలంలోని కూచిపూడి, పెడసనగల్లు, మొవ్వ-ఎ, మొవ్వ -బి, కోసూరు, కాజ కేంద్రాలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు కూచిపూడి పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు.

వలంటీర్లకు సత్కారం

పామర్రు : ప్రతి కుటుంబానికి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్న సారథు వలంటీర్లేనని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మార్కెట్ యార్డు ప్రాంగణంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. వలంటీర్లను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఎంపీపీ దాసరిఅశోక్‌కుమార్, వైస్ ఎంపీపీ రమాదేవి, ఎంపీడీవో భారతి, తహసీల్దార్ శ్రీపల్లవి తదితరులు పాల్గొన్నారు.

చేయూత చెక్కు పంపిణీ

పెదపారుపూడి : ప్రభుత్వ పథకాలతో ప్రతి ఒక్కరూ ఆర్థిక పురోగతి సాధించాలని ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. పెదపారుపూడి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం మహిళలకు నాలుగో విడత చేయూత పథకం చెక్కులను పంపిణీ చేశారు. వలంటీర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మోపర్రులో రైతు భరోసా కేంద్రం, హెల్త్ సెంటర్లను ప్రారంభించారు. ఎంపీపీ సురేష్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

క్రీడా పరికరాల వితరణ

నాగాయలంక : రెడ్‌క్రాస్ ఛైర్మన్ శివ విష్ణువర్థన్, వైస్ ఛైర్మన్ కుటుంబరావు, ట్రెజరర్ లేబాక నాగేశ్వరరావు ఆర్థిక సాయంతో జడ్పీ పాఠశాలకు క్రీడా పరికరాలను హెచ్ఎం కె.శాంతికుమారికి అందజేశారు. ఫిజికల్ డైరెక్టర్స్ గాజుల లక్ష్మీప్రసాద్, పూర్ణచంద్రరావు, సుజాత, రఘురామయ్య పాల్గొన్నారు.

మండవ లక్ష్మీ నీలవేణి రూ.50 వేల విరాళం



కూచిపూడి : మొవ్వ మండవ కనకయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మొదటి బ్యాచ్ విద్యార్థి, రిటైర్డ్ ఇంజనీర్ మండవ వెంకటరత్నం గౌరవార్థం ఆయన కుమార్తె, పూర్వ విద్యార్థి, మండవ లక్ష్మీ నీలవేణి పాఠశాల విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేందుకు స్టీల్ ప్లేట్ల కొనుగోలుకు రూ.50 వేలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సబ్బినేని సాంబశివరావుకు అందజేశారు. విద్యాకుటుంబం ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.



అగ్నిబాధిత కుటుంబానికి టీడీపీ సాయం

కోడూరు : యారారెడ్డిపాలెం అగ్నిబాధిత కోట నాగ శ్రీనివాస్ కుటుంబసభ్యులను మండల టీడీపీ నేతలు మంగళవారం పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సాయమందించారు. బండే శ్రీనివాసరావు, పూతబోయిన శ్రీనివాసరావు, వేములపల్లి రాజేష్, పిల్లి మల్లికార్జునరావు, గోగినేని సోమశేఖరరావు, మేడా శివాజీ, బొప్పన వేణు, రాంబాబు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు విక్కుర్తి ..

కోడూరు : ఉల్లిపాలెంలో టీడీపీ కార్యకర్త చేబ్రోలు రవీంద్ర గత కొద్దికాలంగా అనారోగ్యంతో ఇం టి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. మండల జనసేన, టీడీపీ నాయకులు పరామర్శించి జనసేన నేత విక్కుర్తి శ్రీనివాస్ పంపిన రూ.5 వేల ఆర్థిక సాయమందించారు. మర్రే గంగయ్య, లంకే యుగంధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలు నిర్మాణం నిలిపివేయాలని వినతి

కోడూరు : స్థానిక తొమ్మిదో వార్డు ఎస్సీ కాలనీలో నిర్మిస్తున్న బహుళ ప్రయోజన కమ్యూనిటీ హాలు విషయంలో వివాదం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి మంగళవారం కాంట్రాక్టర్ చేస్తున్న మట్టి పనులను చర్చి సంఘస్థులు అడ్డుకున్నారు. ఎస్సై పి.శిరీష సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని వివాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. తహసీల్దార్ వద్దకు వచ్చి సంబంధిత ఆధారాలు చూపించి వివరంగా తెలియపరచాలని సూచించారు. నిర్మాణం నిలిపివేసి న్యాయం చేయాలంటూ పాస్టర్ కాంతారావు ఆధ్వర్యంలో సంఘస్థులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఏ.సుధాకర్, అరికి ప్రసాద్, జి.సోమయ్య, ప్రేమ్ సుందరరాజు, ఏ.ప్రకాష్, పి.ఎలీషా పాల్గొన్నారు.

ఆలయాల కమిటీ ప్రమాణస్వీకారం

గుడివాడ : భీమేశ్వరస్వామి దేవస్థానం, శ్రీదేవరకొండ నాగన్నగారి సత్రం నూతన కమిటీల ప్రమాణ స్వీకారం మంగళవారం జరిగాయి. ఎమ్మెల్యే కొడాలి నాని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కమిటీ సభ్యులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

మన కోసం మనం ట్రస్ట్‌కు విరాళం



చల్లపల్లి : మన కోసం మనం ట్రస్ట్‌కు దాతలు విరాళాలు అందించారు. విశ్రాంత బిల్ కలెక్టర్ కంఠంనేని రామబ్రహ్మం తన 73వ పుట్టిన రోజును పురస్కరించుకుని ట్రస్ట్ కు రూ.55 వేల విరాళాన్ని అందించారు. కోసూరు పాఠశాల ఉపాధ్యాయుడు యడ్ల వెంకట శ్రీకాంత్ రూ.10 వేల విరాళాన్ని అందించారు. ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ డి.ఆర్కే.ప్రసాద్ స్వచ్ఛ కార్యకర్తల తరపున దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.